## ఘనంగా ఆంజినేయస్వామి వేడుకలు

### - ఉత్సవంలో పాల్గొన్న జడ్పిటిసి ఉమేష్



ఆంజినేయస్వామిని అలంకరించిన దృశ్యం,ఉల్లెకెర ఆంజినేయస్వామి పూజలు జడ్పిటిసి

అగళి, ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రావణ శనివారం పురస్కరించుకుని ఆంజినేయస్వామికి వేడుకలను శనివారం రోజు ఘనంగా జరిపారు. రామాపురం పురాతన ఆంజినేయ స్వామికి వేకువ జామునుంచే పూజలు ప్రారంభమయ్యాయి. పంచామృతాభిషేకం, గణపతిపూజ, హోమాలను నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పూలమాలలతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఆంజినేయ స్వామికి ప్రీతి కరమైన బెమురును, కేసరి కుంకుమతో అలంకరించారు. భక్తులు కూడా స్వామికి కేసరి కుంకుమను నుదుటిపై పెట్టుకున్నారు. మహా మంగళ హారతి అనంతరం మహిళా భక్తులు ప్రత్యేకంగా హారతులను పట్టారు. అదే విధంగా ఉల్లేకర పురాతన ఆంజినేయస్వామికి కూడా శ్రావణ శనివారం పురస్కరించుకుని ఘనంగా వేడుకలను నిర్వహించారు. స్వామికి భక్తులు మణేవు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి మూల విరాట్‌ను భక్తులు ఎత్తుకుని నృత్యం చేశారు. రామాపురం, ఉల్లెకెర గ్రామంలో స్వామికి మహిళల హారతుల అనంతరం అన్నదానం నిర్వహించారు. అదే విధంగా రామణపల్లి రంగనాథస్వామి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌లను వివిధ రకాల పూలతో అలంకరించారు. మహిళలు ప్రత్యేకంగా రంగనాథస్వామికి హారతులను పట్టారు. మహా మంగళ హారతి అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా శ్రావణ శనివారం రోజు ఆంజినేయస్వామి, రంగనాథస్వామి, శనిమహాత్మాస్వామి, సీతారామాంజినేయస్వామి, తోటద అప్ప దేవుళ్ళకు ఘనంగా పూజలు నిర్వహించారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

### - భార్య మృతి, భర్త, మనువడు, మనువరాలికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతిచెందిన సరోజమ్మ ,ప్రమాదంలో గాయపడిన వెంకటనారాయణ, చరణ్, అలేఖ్యలు

బత్తలపల్లి. ఆగస్టు 24 ప్రభాతవార్త

అనంతపురం కదిరి జాతీయ రహదారిపై కారు ద్విచక్రవాహనాన్ని వెనుకవైపు నుండి ఢీకొన్న ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా భర్త, మనువడు, మనవరాలికి తీవ్రగాయాలయ్యాయి. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన చాకలి వెంకటనారాయణ, భార్య సరోజమ్మ(40)లు వారి కుమార్తె కుమారుడు చరణ్, కుమార్తె అలేఖ్యలతో కలసి శనివారం ద్విచక్రవాహనంలో రాప్తాడు మండలం ఆకుతోటపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామికి వెళుతున్నారు. వీరి ద్విచక్రవాహనం మండలంలోని లింగారెడ్డిపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే బత్తలపల్లి వైపు నుండి అనంతపురం వెళుతున్న కారు వెనుకవైపున ఢీకొనింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలోని నలుగురు ఎగిరి కిందపడ్డారు. దీంతో సరోజమ్మ అక్కడికక్కడే మృతిచెందగా భర్తకు, మనువడు, మనువరాలికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు వెంటనే బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ శ్రీనివాసులు తమ పిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు, కుమార్తెలు వున్నట్లు తెలిపారు.

## గ్రంథాలయాన్ని తనిఖీ నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

రామగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న కార్యదర్శి పి.రమ

రామగిరి శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, వార్షిక తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీలో భాగంగా శాఖ గ్రంథాలయానికి సంబంధించిన పలు రికార్డులు పరిశీలించడం జరిగింది. అలాగే గ్రంథాలయ పన్ను వివరములు అడిగి తెలుసుకొని పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ పన్ను బకాయిలు వెంటనే వసూలు చేయుటకు కృషి చేయవలనని గ్రంథాలయాధికారికి తెలియజేయడం జరిగింది. అనంతరం పాఠకులతో మాట్లాడుతూ.. గ్రంథాలయ పనిప తీరు గురించి అడిగి తెలుసుకొని, గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకములను ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అలాగే పోటీ పరీక్షల పుస్తకాల కొరకై రిజిస్టర్‌లో నమోదు చేస్తే వీలైంత తొందరగా తెప్పిస్తాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేష్, రామాంజినేయులు పాఠకులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీకు మైనార్టీ నాయకుడు మద్దికెర అన్వర్‌బాషా రాజీనామా

### -స్వార్థ రాజకీయాల కోసం నాయకత్వం వాడుకొని వదిలేసిందని ఆరోపణ

ఉరవకొండ, ఆగస్టు 24 ప్రభాతవార్త



మద్దికెర అన్వర్‌భాషా

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకు ఆ పార్టీ మైనార్టీ నాయకుడు, సచివాలయ కన్వీనర్ పట్టణానికి చెందిన మద్దికెర అన్వర్‌భాషా రాజీనామా చేశారు. శనివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముస్లీం మైనార్టీ వర్గాలకు వైఎస్సార్‌సీపీలో న్యాయం జరుగుతుందని నమ్మి పార్టీలోకి రాగా ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. కష్టనష్టాల్లో అన్నికాలలుగా అండగా ఉంటానని ప్రగల్బాలు పలికిన యువనేత ప్రణయ్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తరువాత పార్టీను నమ్ముకొని పార్టీ కోసం అహర్నిషలు శ్రమించిన నాలాంటి వారిని కనీసం ఎలా ఉన్నారని కూడా పలుకరించలేదన్నారు. ఎన్నికలకు ముందు నాలాంటి ముస్లీం మైనార్టీ యువతను రెచ్చగొట్టి పని చేయించుకున్నారన్నారు. వాడుకొని వదిలేసే ఇలాంటి నాయకుల మాటలునమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకత్వం ఉరవకొండలో షాదీఖానా పూర్తి చేయలేదని, వెనుకబడిన ముస్లీం మహిళలకు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని రాజకీయంగా కూడా సముచిత స్థానం కల్పించలేదని మద్దికెర అన్వర్‌భాషా విమర్శించారు.

## వైభవంగా శ్రీవారి పల్లకీ ఉత్సవం

ఉరవకొండ, ఆగస్టు 24 ప్రభాతవార్త



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మినరసింహుని పల్లకీ ఉత్సవం దృశ్యం

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం శ్రావణ పంచమి శనివారం సాయంత్రం లక్ష్మినరసింహుని పల్లకీ ఉత్సవం వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చి గా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా క్షేత్రం గుండా గలగలపారే నీటి జలపాతాల ను తిలకించడానికి వస్తున్న పర్యాటకులతో క్షేత్రం కిటకిటలాడుతోంది. ఈ కార్యక్రమంలో షేక్షానుపల్లికు చెందిన నరేష్, చలపతి, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వివాహాది శుభకార్యాలకు మెరుగైన సౌకర్యాల కల్పన అభినందనీయం

### -గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి డా॥కరిబసవరాజేంద్రస్వామి

ఉరవకొండ, ఆగస్టు 24 ప్రభాతవార్త



కళ్యాణ మండపం స్థలదాత మిడతల కరియప్ప విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఉత్తరాధికారి డా॥కరిబసవరాజేంద్రస్వామి తదితరులు

ప్రజలు వివాహాది శుభకార్యాలను నిర్వహించు కోవడానికిగాను కళ్యాణ మండపంలో మెరుగైన సౌకర్యాలు కల్పిన్తుండటం అభినందనీయమని గవిమఠం ఉత్తరాధికారి డా॥కరిబసవరాజేంద్రస్వామి అన్నారు. పట్టణ బళ్లారి బైపాస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కనగల రామలింగ చౌడేశ్వరి దేవాంగ కళ్యాణ మండపంలో దాదాపు 3.5 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 12 ఏసీలను శనివారం ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. అంతకు ముందు ఉత్తరాధికారి కళ్యాణ మండపం స్థలదాత మిడతల కరియప్ప విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఉత్తరాధికారి డా॥కరిబసవ రాజేంద్రస్వామి మాట్లాడుతూ కళ్యాణ మండపం జాతీయ రహదారికి పక్కన ఉండటంవల్ల అందరికీ సౌకర్యవంతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాంగ కళ్యాణ మండపం అధ్యక్షులు చంగల మహేష్, ఉపాధ్యక్షులు మిడతలవిశ్వనాథ్, గౌరవాధ్యక్షుడు మిడతలచంద్రమౌళీ, సాదు వెంకటస్వామి, కోశాధికారి నిమ్మల వెంకటరమణ, కార్యదర్శి గోపాలం దత్తాత్రేయులు, సహాయ కార్యదర్శులు చంగల అమరేష్, ముక్కర బాలచంద్ర, కమిటీ సభ్యులు గిద్దలూరి సూర్యనారాయణ, చింతగింజల మల్లికార్జున, కటికల వెంకటేశులు, దేవాంగ సంఘం పెద్దలు కొమ్మసాని బాలచంద్ర, మిడతల రాంమూర్తి, ఎం.సి.నాగభూషణం, మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ ఆటోకాడ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

### -ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ

ఉరవకొండ, ఆగస్టు 24 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెప్టెంబర్ 5వ తేదీ నుండి ఎలక్ట్రికల్ ఆటోకాడ్ కోర్సును ప్రారంభిస్తున్నామని ఈ కోర్సులో చేరేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ తెలిపారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఎలక్ట్రికల్ ఆటోకాడ్ కోర్సులో చేరేందుకు ఐటీఐ, డిప్లొమో, బిటెక్, ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. కేవలం 30 మందికి మాత్రమే కోర్సులో చేరే అవకాశం ఉందని 30 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. శిక్షణ పూర్తీ చేసుకున్న అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ వారు సర్టిఫికేట్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుకు కేవలం 1,500 రూపాయలు ఫీజు మాత్రమే ఉంటుందని ఇతర వివరాల కోసం లెక్చరర్ ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బి.చంద్రమోహన్ సెల్ నంబర్ 79894 87987కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ సూచించారు.

## క్లాక్‌టవర్ కూడలిలో ఆకుకూరలు, కూరగాయలు విక్రయిస్తే చర్యలు

### -వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేసిన పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

ఉరవకొండ, ఆగస్టు 24 ప్రభాతవార్త



క్లాక్‌టవర్ కూడలిలో వ్యాపారులకు సూచనలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

పట్టణంలోని క్లాక్‌టవర్ చుట్టూ ఆకుకూరలు, కూరగాయలు విక్రయాలు చేయరాదని ఎవరైనా నిబంధనలు అతీక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ హెచ్చరికలు జారీ చేశారు. క్లాక్ టవర్, ప్రధాన కూడళ్లల్లో రోడ్లపైన ఇష్టారాజ్యంగా తోపుడు బండ్లు, ఇతరత్రా వాహనాలు నిలిపి కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఇతరత్రాలను విక్రయాలు జరుపుకొంటుండటంచేత ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని పిర్యాదులు అందిన నేపధ్యంలో శనివారం ఆయన పోలీసు హెడ్ కానిస్టేబుల్ జయకుమార్‌తో కలిసి ప్రధాన కూడళ్లలో పర్యటించి వ్యాపారులను హెచ్చరించారు. ఆదివారం నుండి ప్రధాన కూడళ్లపై నిరంతర నిఘా కొనసాగుతుందని ఎవరైనా వ్యాపారులు నిబంధనలను అతీక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఆటో డ్రైవర్ ఆత్మహత్య



వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన దృశ్యం

గుత్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త : పట్టణంలోని చెంబులబావివీధిలో నివాసం వుంటున్న చంద్రశేఖర్ (53) అనే ఆటో డ్రైవర్ శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను 15 రోజుల క్రితం తన పెద్దకుమార్తెకు తిరుపతిలో వివాహం చేశాడు. ఆర్థిక సమస్యలు, అనారోగ్యం కారణంగా మానసికంగా కృంగిపోయి అతని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. మృతునికి భార్య, ఇద్దరు సంతానం వున్నారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా లక్ష్మినరసింహస్వామి గరుడ వాహనోత్సవం...

రాయదుర్గం, ఆగస్టు 24 ప్రభాతవార్త:



స్వామివారి పల్లకి నిర్వహిస్తున్న అర్చకులు, కమిటి సభ్యులు

రాయదుర్గం మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విప్రమలై శ్రీ లక్ష్మినరసింహస్వామి పల్లకి మహోత్సవం శ్రావణమాసం మూడవ శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది శ్రావణమాసంలో వచ్చే మూడవ శనివారంలో నరసింహస్వామికి పల్లకి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయ కమటి గౌరవాధ్యక్షులు రామ్మూర్తిస్వామిజీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి శ్రీ లక్ష్మిసమేత స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాబిషేకం, పుష్పాలంకరణ, ఆకుపూజ, నైవేద్య పూజలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించిన పల్లకిలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అదిష్టించి మేళతాళాలదో ఊరేగించారు. మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం గావించారు. శ్రావణమాసం మూడవ శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్బంగా రాయదుర్గం పట్టణానికి చెందిన పసుపులేటి శ్రీరాములు కుటుంబ సభ్యులు భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అద్యక్షులు బిఎన్.తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారులు జీఎం నరసింహులు, ఎస్ఆర్ఎస్ సత్యానారాయణ, కార్యదర్శి గురురాఘవేంద్రప్రసాద్, సభ్యులు గురునాథ్‌రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

## అలెగ్జాండర్ లాంటి తహసీల్దార్ రాయదుర్గంకు రావడం ప్రజలకు ఎంతో మంచింది...

రాయదుర్గం, ఆగస్టు 24 ప్రభాతవార్త:



బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు ఫోటో

రాయదుర్గం తహాసీల్దార్‌గా అలెగ్జాండర్‌ని ప్రభుత్వం నియమించినట్లు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికి ఇంతవరకు తహాసీల్దార్ అలెగ్జాండర్ ఎందుకు విధుల్లోకి రాలేదని?, మాకు గానీ, రాయదుర్గం ప్రజలకు గాని ఇంతవరకు అర్థం కాలేదని, ఇలాంటి అధికారి రాయదుర్గానికి రావడం రాయదుర్గం ప్రజలకు ంతో మంచిందని బహుజనసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి నిజాయితీ గల అధికార్లు రాయదుర్గానికి దూరం అయిపోతున్నారని, అవినీతికి మారుపేరైనటువంటి అధికారులు దగ్గరవుతున్నారన్నారు. దీని వెనుక ఉన్న అంతరయం ఏమిటో మాకు, పట్టణ ప్రజలకు ఇంతవరకు అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి అదికారులు రావడం వల్ల(తహసీల్దార్ అలెగ్జాండర్)రాయదుర్గం సామాన్య ప్రజలకు ఎంతో న్యాయం అనేది జరుగుతుందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం ఇలాంటి నీతి నిజాయితీ గత అధికార్లును రాయదుర్గంలో నియమిస్తే ఎంతో బాగుటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాకపోతే గతంలో రాయదుర్గంలో గత ప్రభుత్వంలో ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులనే నియమిస్తున్నారన్నారు. దీనిపై ఒక్కసారి ఎమ్మెల్యే, ప్రభుత్వం ఆలోచన చేయాలని, ముఖ్యంగా రాయదుర్గం ప్రజలు దీనిని గమనించాలని, గతంలో అన్యాయాలకి అక్రమాలకు పాల్పడిన వ్యక్తులను, ఈ రోజు నిజాయితీకి మారుపేరు అని చెప్పుకుంటున్న టిడిపి ప్రభుత్వం రాయదుర్గంలో అవినీతిని ప్రోత్సహిస్తుందా?, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి ఇలాంటి అవినీతి పరులే రాజ్యమేలుతారా?, ప్రభుత్వం, ఎమ్మెల్యేఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. రాయదుర్గంలో అవినీతి అధికారులను, తొలగించి నీతి నిజాయితీగా పనిచేసే ఎంతో మంది అధికారులు ఉన్నారని, అలాంటి అధికారులకు అవకాశం కల్పించి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుస్తుందని ఆశిస్తున్నామన్నారు. పట్టణంలో ఐదు సంవత్సరాలకు పైబడి ఎంతో మంది అధికారులు అక్కడే విధులు నిర్వహించడం జరుగుతుందని, దీనిపై కలెక్టర్ గానీ, ఎమ్మెల్యే గానీ, మంత్రులు, ముఖ్యమంత్రులు స్పందించాలన్నారు. ఐదు సంవత్సరాలకు మించి రాజకీయ అండదండలతో ఉద్యోగాలు చేస్తున్న అధికారులు ఎంతో మంది ఉన్నారని, దీనిపై ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ చర్యలు తీసుకొని ఈ అవినీతిని ప్రక్షాళన చేసి నిజాయితీ ఉన్న ఉద్యోగులను నియమించాలని ఆయన మనవి చేశారు.

## శ్రీఆంజనేయస్వామికి విశేషపూజలు

అమరాపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త



శ్రీఆంజనేయస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

మండలంలోని హాలుకూరు హనుమంతనపల్లి గ్రామాల్లో శనివారం శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో విశేషపూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకుని స్వామివారికి మహిళలు హారతి ఉత్సవాలను ప్రతి ఇంటి నుండి తీసుకెళ్లి శ్రీఆంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని దేవాలయం వద్ద నిర్వహించారు.

## ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### -ఆకట్టుకున్న చిన్నారి కృష్ణులు, గోపికమ్మలు, ఆసక్తికరంగా ఉట్టికొట్టే కార్యక్రమం

ఉరవకొండ, ఆగస్టు 24 ప్రభాతవార్త



కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారి కృష్ణులు, గోపికమ్మల వేషధారణతో చిన్నారులు



ఉట్టి కొడుతున్న చిన్నారి కృష్ణుడు

పట్టణంలోని ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి పర్వదిన ముందస్తు వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాలలో చదువుకొంటున్న చిన్నారులను వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చిన్ని కృష్ణులు, గోపికమ్మలుగా అందంగా ముస్తాబు చేసి పాఠశాలకు తీసుకురాగా ప్రిన్సిపాల్ విక్రమ్ ఆధ్వర్యంలో జరిగిన కృష్ణుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చిన్ని కృష్ణులు పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం భక్తి గీతాలకు చిన్ని కృష్ణులు గోపికమ్మలతో కలిసి చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శేఖరుని చొరవతో..రెడ్ క్రాస్ సొసైటీకి 4.50 ఎకరాల భూమి

### -హైవేలో ప్రభుత్వ భూమి కేటాయింపు..సరిహద్దులు సైతం నిర్ధారించిన అధికారులు-రెవెన్యూ అధికారులతో పాటు భూమిని పరిశీలించిన బిజెపి జిల్లా, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్



భూమిని పరిశీలిస్తున్న దృశ్యం



అధికారులతో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ శేఖర్

గోరంట్ల, ఆగస్టు 24 ప్రభాతవార్త

ఎట్టకేలకు రెడ్‌క్రాస్ సొసైటీ పేరుతో పేదల కోసం ఒక ఆసుపత్రిని నిర్మించాలన్న లక్ష్యంగా జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం. దీంతో బిజెపి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ కల సాకారంగా అధికారులు తీసుకుంటున్న చొరవను బట్టి తెలుస్తోంది. ఇందుకు నిదర్శనమే గోరంట్ల మండలం పాలసముద్రం జాతీయ రహదారికి దగ్గరగా వున్న సర్వే నెంబర్ 130లో గల భూమిని జాతీయ రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్, సత్యసాయి జిల్లా బిజెపి అధ్యక్షులు జిఎం శేఖర్‌కి సత్యసాయి జిల్లా కలెక్టర్, ఆర్డీఓ భాగ్యరేఖ ఆదేశాల మేరకు గోరంట్ల మండల ఇన్‌చార్జ్ తహశీల్దార్ రెడ్డిశేఖర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి విచ్చేసి కేటాయించినున్న భూమిని వాటి హద్దులు చూపించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ జిఎం శేఖర్ మాట్లాడుతూ కోరిన వెంటనే మాకు ఎంతగానో సహకరించిన ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి సంస్థకు మా సహాయ సహకారాలు వుంటాయని హామీ ఇచ్చి సంస్థకు స్థలం కేటాయించిన జిల్లా కలెక్టర్ చేతన్, ఆర్డీఓ భాగ్యరేఖ, రెవెన్యూ సిబ్బందికి సంస్థ తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసులు, మండల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, వడిగేపల్లి సర్పంచు నరసింహామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కంటెంట్‌యాప్‌కు ఉత్తమ సేవలకు అవార్డు

రామగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త



ప్రశంసా పత్రాలను అందజేస్తునన ఎమ్మెల్యే సునీత

రాప్తాడు నియోజకవర్గం నుంచి టిడిపి యాప్ కంటెంట్‌ను షేర్ చేయడంలో ఉత్తమ స్థానంలో నిలిచిన నాయకులకు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం నుంచి పంపబడిన ప్రశంసాపత్రాలను రాప్తాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు పరిటాల సునీత చేతులు మీదుగా అందించారు.

## ఆ నలుగురు విద్యాశాఖ సిబ్బందికి అభినందన సత్కారం

### -గోరంట్ల మండల ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఘన సత్కారం

### -హాజరైన విద్యాశాఖ అధికారులు



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల, ఆగస్టు 24 ప్రభాతవార్త

పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు పంద్రాగస్టు రోజున ఉత్తమ సేవా అవార్డులు పొందినందుకు గాను మండల ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఉదయ్‌కిరణ్ ప్రైవేటు పాఠశాల ఆవరణలో ఈ సత్కార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాలకు మండల విద్యాశాఖ అధికారి జాన్‌రెడ్డప్ప, గోపాల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సన్మాన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలైన నూర్‌మహమ్మద్, నాగరాజు, పద్మజ, అరుణకుమార్‌లను మండల ప్రైవేటు పాఠశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు గౌస్‌బాష, లక్ష్మీపతి, మధుసూదన్, ప్రవీణ్, అల్లాబకాష్, కృష్ణారెడ్డి, నాగేంద్ర, తదితరులు శాలువాలు, పూలమాలలతో మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## 26న మాధవరాయ టెంపుల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గోరంట్ల, ఆగస్టు 24 ప్రభాతవార్త

పట్టణంలోని పురాతన మాధవరాయ దేవాలయంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు గోరంట్ల హిందూశాఖ సమాజనాయకులు తెలిపారు. ఈసందర్భంగా ఉదయం 9నుండి మధ్యాహ్నం 2గంటలవరకువివిధరకాల పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామని ఇందులో భాగంగా ఉదయం 9నుండి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్దనుండి మాధవరాయ దేవాలయంవరకు ప్రధానరహదారిలో ఊరేగింపుగా రావడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మాధవరాయుని ఆలయంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి అదేవిధంగా శ్రీమాధవరాయుని కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందచేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకలకు వచ్చే వారు తమ పిల్లలను శ్రీకృష్ణుడు, గోపికల వేషదారణలతో అలంకరించి తీసుకరావాలని వారు కోరారు.

## శ్రీశనీశ్వరస్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం

అమరాపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని మద్దన కుంట గ్రామంలో శ్రావణ శనివారం సందర్బంగా శ్రీశనీశ్వరస్వామి, నాగమ్మ దేవి ఆలయం వద్ద గ్రామ ప్రజలు విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామ దేవత అయిన అమరాపురం పట్టణంలో వున్న శ్రీచోళమాంబదేవి ఉత్సవమూర్తిని అమరాపురం నుండి మద్దనకుంట వరకు ఊరేగింపుగా మేళతాళాలతో తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. నాగమ్మ దేవాలయంలో ప్రతిష్టాపన చేసి విశేష పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చోళమాంబ ఉత్సవమూర్తిని గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

05ATP24_05ATP24.qxd 24-08-2024 PM 10:35 Page 1






## కార్కళలో యువతికి మత్తుమందు డ్రింక్ చేయించి రేప్‌చేసిన దుండుగులు

**కార్కళ (ఉడుపి జిల్లా ),ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి**

ఉడుపి జిల్లా కార్కళ పట్టణంలో కొందరుదుండగులు ఒక యువతిని మాయమాటలతో నమ్మించి పార్టీ చేసుకుందామని వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి మత్తుమందులతో లొంగదీసుకుని బలాత్కరం చేసిన ఉదంతం వెలుగు చూసింది.కార్కళ పట్టణంలో హిందూ యువతులను టార్గెట్ చేసి కొందరు దుండగులు అఘాయత్యం చేస్తున్నారనే ఆరోపణలపైన పోలీసులు శనివారం ఇద్దరు దుండగులను అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు కార్కళకు చెందిన నలుగురు యువకులు కార్లో షికారు చేస్తూ అందమైన యువతులను లోబర్చుకుని వారిపై అఘాయత్యం చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి.శుక్రవారం జరిగిన సంఘటనలో బలాత్కరానికి గురైన యువతి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు యువతిని ఉడుపిలోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్చారు.అతివాద హిందూ సంఘం యువకులు ఇది లవ్‌జిహాద్ అని కార్కళ పోలీసు స్టేషన్ ముందు ఆందోళన నిర్వహించారు.పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కేసు గురించి నిశితంగా దర్యాప్తు చేస్తున్నారు.

## హుబ్బళ్లి సమీపంలో టిప్పర్‌ను ఢీకొన్న కారు

### - ముగ్గురు కొప్పళ్ వాసులు మృతి

**హుబ్బళ్లి, ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి**

హుబ్బళ్లిలోని కెరెసూరు గ్రామం వద్ద శనివారం వేకువ జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు స్థలంలో మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొప్పళ్ జిల్లా మంగళాపుర గ్రామానికి చెందిన జాఫర్‌సాబ్,మహమద్, షోయబ్ అనే వ్యక్తులు హుబ్బళ్లి నుంచి కారులో కొప్పళ్‌కు వెళుతుండగా కెరెసూరు గ్రామం వద్ద ఎదురునుంచి వచ్చిన టిప్పర్‌లారి కారును ఢీకొట్టగా ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడె మృతి చెందారు.పోలీసు ఉన్నతాధికారులు స్థలానికి వచ్చి పరిశీలించారు.

## సెంట్రల్‌జైల్లో మాదకద్రవ్యాల వాడకం ఆరోపణలపైన సిసిబి పోలీసుల దాడులు

**బెంగళూరు,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు శివారులోని పరప్పనఅగ్రహారలో ఉన్న బెంగళూరు కేంద్ర కారాగృహంపైన శనివారం వేకువజామున 100మంది సిసిబి పోలీసులు ఒకేసారి దాడిచేసి అన్ని బ్యారక్‌ల్లో ఉన్న ఖైదీలను సోదా చేశారు.ఇటీవల కన్నడ సిన్మా హీరో దర్శన్ తన సహచరులతో ఇదే జైల్లో అండర్‌ట్రయల్‌గా జైలుశిక్ష అనుభవిస్తుండటంతో పలువురు సన్నిహితులు అతడిని చూసేందుకు వస్తూపోతూ ఉన్నారు.బయట వ్యక్తుల రాకపోకల పట్ల జైలు అధికారులు చూసిచూడనట్లు ఉండటంతో జైల్లో మద్యసేవనం, మాదకద్రవ్యాల వాడకం మొబైల్‌ఫోన్ల వాడకం పెరిగిందని ఆరోపణలు రావటంతో సిసిబి డిసిపి శ్రీనివాస్‌గౌడ నాయకత్వంలో ముగ్గురు ఎసిపిలు,8మంది ఇన్‌స్పెక్టర్ల నాయకత్వంలో 100మంది పోలీసులు సెంట్రల్‌జైలుపై దాడిచేశారు.సిసిబి దాడుల్లో మొబైల్‌ఫోన్ల ఛార్జర్లు, డ్యాగర్లు, గంజాయి ప్యాకెట్లు, బ్లేడ్లు,మాదకద్రవ్యాల పొట్లాలు బయటపడ్డాయి. వీటన్నిటి సేకరించిన సిసిబి పోలీసులు సెంట్రల్ జైలు పోలీసు సిబ్బందిని విచారణ జరిపారు.ఈజైలులో అండర్‌ట్రయల్స్‌గా శిక్ష అనుభవిస్తున్న సైకిల్ రవి,విల్సన్‌గార్డెన్ నాగా తదితర క్రిమినల్స్ సినీహీరో దర్శన్‌తో క్లోజుగా ఉంటున్నారన్న సమాచారం మేరకు సిసిబి పోలీసులు సదరు రౌడీ గ్యాంగుల సహచరులను ప్రశ్నించారు.సోదాలు సాయంత్రం వరకు కొనసాగాయి.

## కర్ణాటక ఇంజనీరింగ్ టెక్నాలజీ రంగంలో 8300కోట్లు పెట్టుబడులు పెట్టనున్న షెవరాన్ కంపెనీ : ఎంబి.పాటిల్



షెవరాన్ కంపెనీ కార్యక్రమంలో పాల్గొన్న భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబి.పాటిల్ తదితరులు

**బెంగళూరు,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి**

ఇంధన పరిహార రంగంలో నూతన ఆవిష్కారాలకు పాటుపడుతున్న అంతర్జాతీయ కంపెనీ శెవరాన్ కంపెనీ కర్ణాటకలో 8300కోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టనుందని భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబి.పాటిల్ చెప్పారు.ఆయన బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో శెవరాన్ కంపెనీ ముఖ్యస్తులతో సమావేశమయ్యారు.బెంగళూరులో ఈ కంపెనీ అంతర్జాతీయస్థాయిలో ప్రొడక్షన్ డిజైనింగ్ ఎక్స్‌లెన్స్ సెంటరును నిర్మించనుంది.ఈ కేంద్రం ద్వారా 600మంది అంతర్జాతీయ టెక్నాలజీ నిపుణులను తీసుకురానుందని చెప్పారు.ఇంధన రంగంలో నూతన టెక్నాలజీని తీసుకువచ్చేందుకు ఈ కంపెనీ తన వ్యవహారాలను కర్ణాటక నుంచి నడుపుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో శెవరాన్ ఇండియా ముఖ్యస్తులు డాక్టర్ అక్షయ్‌సాహ్ని,జనరల్ మేనేజర్ కేట్ కలఘన్ తదితరులు పాల్గొన్నారు.వచ్చే రోజుల్లో ఈ కంపెనీ ద్వారా నూతన ఇంధన ప్రాజెక్టులు అమల్లోకి రానున్నాయని చెప్పారు.

## మండ్యజిల్లా నాగమంగల నగరసభను కైవసం చేసుకున్న కాంగ్రెస్‌పార్టీ

**మండ్య,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి**

మండ్యజిల్లా నాగమంగలపట్టణ పంచాయతీ అధ్యక్ష ఉపాధ్యక్ష స్థానాలకు శనివారం జరిగినఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ రెండు స్థానాలను గెలుచుకుంది.ఈ నగరసభలో జెడిఎస్‌పార్టీకు పూర్తిస్థాయి మెజారిటీ ఉన్నా కూడా నాగమంగల ఎంఎల్ఎ వ్యవసాయశాఖ మంత్రి ఎన్.చెలువరాయ స్వామి చక్రం తిప్పి తన అనుచరవర్గాన్ని గెలిపించుకున్నారు.కాంగ్రెస్‌నుంచి అఫ్సర్ ఆలీ అధ్యక్షుడుగా వసంతలక్ష్మి ఉపాధ్యక్షురాలిగా ఒక్కఓటు మెజారిటీతో గెలిచింది.ఈ ఎన్నికల్లో జెడిఎస్‌కు చెందిన ముగ్గురు వార్డు మెంబర్లను గైరుహాజరు చేయించటం ద్వారా కాంగ్రెస్‌పార్టీ రెండు స్థానాలను గెలుచుకుంది.

## ఆర్టీసి ఛార్జీలు పెంచుతాం : రామలింగారెడ్డి

**బెంగళూరు,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటకలో ఆర్టీసి బస్సు ఛార్జీలను పదినుంచి పదిహేను శాతం పెంచుతామని సిఎం అనుమతి తీసుకున్నాక ఇవి అమల్లోకి వస్తాయని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి చెప్పారు.ఆయన శనివారం బెంగళూరు కెపిసిసి కార్యాలయంలో పార్టీ కార్తకర్యల భేటి చేసిన తరువాత మీడియాతో మాట్లాడారు. ఆర్టీసి బస్సుల నిర్వహణ సిబ్బంది జీతభత్యాలు,వ్యయం పెరిగిపోతున్న నేపథ్యంలో బస్సు ప్రయాణ ధరలను పెంచాలనే ఆలోచనతో ఉన్నట్లు చెప్పారు.సుమారు 15శాతం అదనపుఛార్జీలు పెంచేందుకు సిఎంతో చర్చించనున్నట్లు తెలిపారు.సిఎం అనుమతి లభించిన తరువాత ప్రయాణధరల పెంపు అమల్లోకి వస్తుందని చెప్పారు.

## సోలార్‌తో వినియోగదారుడికి ఆదాయం

### - పీఎం సూర్యఘర్ యోజన సమావేశంలో ఎస్ఈ సంపత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సంపత్‌కుమార్

**కదిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త**

సోలార్ ప్యానల్ వాడకంతో వినియోగదారుడికి ఆదాయం సమకూరుతుందని, ఉమ్మడి జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై డివిజన్‌స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాల విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కేవలం 63 కోట్ల బిల్లులు వసూలు అయ్యేవని, ప్రస్తుతం రూ.35 కో ట్లు పెరిగిందన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు అధికారులు, సిబ్బంది నిరంతరం సేవలు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసి ఖర్చులను తగ్గించుకునే దిశగా ప్రణాళికలు తీసుకొచ్చారన్నారు. సోలార్‌ప్యానెల్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా రూ78వేలు గరిష్ట సబ్సిడి పొంద వచ్చని ప్రతి నెలా 90 శాతం విద్యుత్‌చార్జీలు తగ్గించుకోవచ్చన్నారు. సోలార్ ప్యానెల్‌తో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను వినియోగదారుడు వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను నెట్ మీటర్ ద్వారా విద్యుత్ సంస్థకు విక్రయించి ఆదాయం పొంద వచ్చన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసి సర్వీసు అందించడంలో సన్‌టెక్ మొదటి స్థానం, అత్యధికంగా అవార్డులు పొందిన సంస్థ అన్నారు. ప్రతి ఒక్క వినియోగదారుడు సోలార్ ప్యానల్ వినియోగించే విధంగా విద్యుత్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం విద్యుత్‌శాఖ ఉమ్మడి జిల్లాల ఎస్ఈగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి కదిరి వచ్చిన సందర్భంగా విద్యుత్‌శాఖ ఈఈ మోషెస్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది పూలమాలలతో దుశ్శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ మోషెస్, బాలాజీ, ఎస్ఏఒ, ఏడిఈలు షాజహాన్, సుబ్రహ్మణ్యం, ఓబులేసు, యూనియన్ సంఘం అధ్యక్షులు ఈశ్వర్‌బాబు, ఏఈలు గౌరిశంకర్, చెన్నకృష్ణ, చంద్ర నాయక్, రామసుందర్‌రెడ్డి, బాలకృష్ణనాయక్, శ్రీనివాస్‌నాయక్, శ్రీకాంత్, విద్యుత్‌శాఖ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా శ్రావణ మాసం వేడుకలు



ప్రత్యేక పూజలు అందు కుంటున్న ఆంజినేయస్వామి

**గాండ్లపెంట, ఆగస్టు 24 ప్రభాతవార్త**

శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా మండలంలోని పలు ఆంజినేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని మునగలవారి పల్లి గరుడాంజనేయ స్వామికి అభిషేకం, ఎంతో ఇష్టమైన ఆకుపూజ చేసి వివిధ రకాలైన పుష్పాలతో అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. టెంకాయలు కొట్టి దూప, ధీప నైవేద్యములు సమ ర్పించి భక్తులు తమ మొకర్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. గాండ్లపెంట కోదండ రామస్వామి, బొలుగుట్ల పల్లి, వేపరాళ్ల, రెక్కమాను, మల్లమీదపల్లి, కోటూరు పలు ఆంజినేయస్వామి ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. వేపరాళ్ల ఆంజినేయస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో పూజల్లో పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్లు అరెస్ట్

**యాడికి, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండలంలోని చందన గ్రామం వద్ద శనివారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సిఐ ఈరన్న తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 7,400 రూపాయల నగదు, 3 మోటర్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. జూదం, మట్కా, తదితర అసాంఘిక కార్యకలాపాలకు నిర్వహిస్తే వాటిపై కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

## 833 సర్కారు రెసిడెన్షియల్ పాఠశాలలకు టెలీస్కోపులు పంపిణీ చేస్తాం

### - ఎన్ఎస్.బోసురాజు



జాతీయ అంతరిక్ష దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న సైన్సుటెక్నాలజీ మంత్రి బోసురాజు తదితరులు

**బెంగళూరు,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటకలో విద్యార్థుల్లో విజ్ఞాన మనోభావాలను పెంపొందించేందుకు సర్కారు ఈఏడాది 833 రెసిడెన్సియల్ పాఠశాలలకు టెలీస్కోపులను సరఫరా చేయనుందని సైన్సు టెక్నాలజీ శాఖ మంత్రి ఎన్ఎస్.బోసురాజు చెప్పారు.ఆయన బెంగళూరు లోని నెహ్రూ తారాలయంలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.విద్యార్థుల్లో వైజ్ఞానిక మనోభావాలను పెంపొందించి భాద్యతాయుతమైన పౌరులుగా రూపొందించేందుకు సర్కారు హైస్కూల్ విద్య నుంచి సైన్సు పాఠాల్లో అంతరిక్ష విజ్ఞానానికి చెందిన పాఠ్యాంశాలను కూడా బోధిస్తున్నామని తెలిపారు.విద్యార్థుల్లో సైన్సు పాఠ్యాంశాల ద్వారా స్ట్రీమ్ ల్యాబ్ అనే నూతన పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా నెహ్రూ తారాలయంలో ఆదిత్య 1 రాకెట్ ఆకృతిని ఏర్పాటు చేశారు.సభలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## క్యూఆర్ పద్ధతి ద్వారా రైలు టికెట్ల జారీకి హుబ్లీ రైల్వే డివిజన్ శ్రీకారం

**బళ్లారి, ఆగస్టు24, ప్రభాతవార్త;**

హుబ్లీ రైల్వే డివిజన్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్‌లలో ఇకపై సెల్‌ఫోన్ ద్వారా కివ్ఆర్ కోడ్ ఉపయోగించి టికెట్ పొందే సౌలభ్యాన్ని కల్పించింది. ఆయా స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన యూటీఎస్ కౌంటర్ల ద్వారా ప్రయాణికులు జనరల్ టికెట్లను నేరుగా, స్పీడుగా కొనుగోలు చేసే వ్యవస్థను కల్పించారు. హుబ్లీ రైల్వే డివిజన్ పరిధిలోని 87 రైల్వేస్టేషన్‌లలోని 102 కౌంటర్‌లలో కివ్ఆర్ కోడ్ సౌలభ్యాన్ని కల్పించినట్లు, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని హుబ్లీ రైల్వే డివిజన్ సీనియర్ డివిజన్ కమర్షియల్ సంతోష్‌హెగడే తెలిపారు. యూటీఎస్ కౌంటర్‌లలో కివ్ఆర్ కోడ్ స్కానర్‌లను ఏర్పాటు చేసినట్లు, త్వరిత చెల్లింపు యూపీఐ విధానం ద్వారా ప్రయాణికులకు వారు వెళ్లే గమ్యస్థానాలకు టికెట్ పొందవచ్చునని చెప్పారు. ఇప్పటికే వివిధ రైల్వేస్టేషన్‌లలో ఏటీవీఎంల ద్వారా కివ్ఆర్ కోడ్‌లను స్కాన్ చేసి ప్రయాణికులు తాము వెళ్లే గమ్యస్థానాలకు జనరల్ టికెట్లు, ప్లాట్‌ఫాం టికెట్లను కూడా కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. హుబ్లీ రైల్వే డివిజన్ ప్రయాణికుల కొరకు నూతనంగా ఈ డిజిటల్ వ్యవస్థను కల్పించినట్లు చెప్పారు.

## ఫించన్ల పంపిణీ వందశాతం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు

**యల్లనూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త**

సెప్టెంబర్ నెలకు సంబంధించి ఫించన్ల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 1వతేదీన ఎన్‌టిఆర్ భరోసా ఫించన్ల పంపిణీ కార్యక్రమం ఉదయం 6 నుండి ప్రారంభించి పెన్షన్‌దారుల ఇళ్ల వద్దకు వెళ్లి మధ్యాహ్నం 12 గంటలలోపు వంద శాతం పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గీత, ఉమాదేవి, స్నేహ, కృష్ణవేణి, మాబు, రెహమాన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక పుష్పాలంకరణలో శ్రీరంగనాథుడు



శ్రీరంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

**తాడిపత్రిరూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండలంలోని ఆలూరుకోనలో వెలసిన శ్రీరంగనాథస్వామి శనివారం ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామిని వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా కోనలో వెలసిన శ్రీఆంజనేయ స్వామి, శ్రీషిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దఎత్తున భక్తులు కోనకు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు జలపాతాల్లో స్నానాలు చేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం హాజరైన భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార క్రమంలో ఆలయ సిబ్బంది కాశీం పాల్గొన్నారు.

## నూతన సిఐని కలిసిన తేదేపా నాయకులు



సిఐని సన్మానిస్తున్న తేదేపా నాయకులు నరసింహులు

**యాడికి, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన ఈరన్నను శనివారం తేదేపా నాయకులు సత్కరించారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ మండల ప్రజల సంరక్షణే తమ బాధ్యతగా విధులు నిర్వహించాలని తేదేపా నాయకులు నరసింహులు కోరారు. సిఐని కలిసిన వారిలో చలమారెడ్డి, సూర్యుడు, తదితరులు వున్నారు.

## మొక్కలు పంపిణీ

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 24 ప్రభాతవార్త**



మొక్కలు పంపిణీ చేస్తున్న శివప్రసాద్‌రెడ్డి

పట్టణంలోని పుట్లూరురోడ్డు రైల్వేగేటు వద్ద శనివారం రుద్రశక్తి అర్బన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రుద్రశక్తి అర్బన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు భీమిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆది, హరి, సతీష్‌రెడ్డి, మస్తాన్, ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఆంజనేయస్వామికి ఆకుపూజలు



**యల్లనూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం మూడవ శనివారం పురస్కరించుకుని ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు స్వామివారికి ఆకుపూజలు చేయించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## వాహనాల తనిఖీ



బస్సులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటనారాయణ

**అమడగూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండల సరిహద్దులోని చినగానపల్లి క్రాస్ వద్ద ఎస్ఐ వెంకటనారాయణ శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారుల ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆర్‌సిలు, లైసెన్స్‌లు, హెల్మెట్లు వుండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను వాహనాల్లో తరలించరాదని, అతివేగం ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉల్లాసంగా..ఉత్సాహంగా ఉట్టి కొట్టే పోటీలు

### - సివి రమణారెడ్డి పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### - ఆకట్టుకున్న గోపిక, గోపాలుని వేషదారణలు



ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణుడు

వేషదారణలో చిన్నారులు, నృత్యం చేస్తున్న చిన్నారులు

**యాడికి, ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు గ్రామంలోని సివి రమణారెడ్డి పాఠశాలలో కరస్పాండెంట్ లారెన్స్‌బాబు, యాజమాన్యం ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఉట్టి కొట్టే పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. పలు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుమునుపు పాఠశాల కరస్పాండెంట్ గోపిక, గోపాలుని విగ్రహానికి పూలమాల సమర్పించి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వాపరయుగంలో శ్రీకృష్ణుని జననం, రేపల్లెలో తల్లి యశోద సంరక్షణలో చిన్ని కృష్ణుడు ఒకవైపు గోపికలతో ఆడుకుంటూ మరోవైపు ఆధ్యాత్మిక చింతనలో దైవత్వం గురించి తల్లికి పరోక్షంగా తెలిపిన విధానం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముకుంద చిత్రంలోని గోపికమ్మ అనే పాటకు విద్యార్థులు చేసిన నృత్యం అందరిని విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు గోపిక, గోపాలుని వేషదారణలతో అందరిని ఆకట్టుకున్నారు.

## కోలాహలంగా శ్రీపాలపాటిదిన్నె ఆంజనేయస్వామి వారి శ్రావణమాస ఉత్సవాలు



ప్రాకారోత్సవ కార్యక్రమంలో బీజేపి మైనార్టీ అధ్యక్షులు ఇంతియాజ్ అహ్మద్

**నల్లచెరువు, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

మండల పరిధిలో ప్రమాణాలకు పేరుపొందిన శ్రీపాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వేలాధిమంది భక్తులు కర్నాటక, వివిధ ప్రాంతాల నుండి భారీ స్థాయిలో తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుండి అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు,తమలపాకులతో అర్చన, ప్రత్యేక పుష్పాలతో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉండి దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో దుకాణాలు, తినుబండారాలు, స్త్రీలకు అరుదైన హంగులతో లేటెస్ట్ మోడల్ వస్తువులు అన్ని విక్రయించేందుకు మహిళలు కిటకిటలాడారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి ప్రాకారత్సోవ విగ్రహాన్ని ఊరేగించారు. చెక్కభజనలు, కోలాటాలు, ప్రత్యేక భక్తి గీతాలతో భక్తులు ఆనందంతో తేలారు.

## కార్మిక నాయకుడు సూర్యనారాయణరావు నిస్వార్థ రాజకీయనాయకుడు

### - ముఖ్యమంత్రి సిద్దరామయ్య



కామ్రేడ్ సూర్యనారాయణరావు శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య తదితరులు

**బెంగళూరు, ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి**

కార్మికనాయకుడు ఎస్.సూర్యనారాయణరావు కార్మిక హక్కులను సాధించేందుకు కడవరకు పోరాడిన ధీమంత నాయకుడని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కార్మికనాయకుడి సేవలను గుర్తు చేసుకున్నారు.బెంగళూరులో శనివారం సిఐటియు రాష్ట్రకమిటి కామ్రేడ్ సూర్యనారాయణరావు శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన కర్ణాటక అభివృద్ధిలో కార్మిక పోరాటాల పాత్ర సెమినారులో ముఖ్య అతిథిగా మాట్లాడారు.తాను కామ్రేడ్ సూర్యనారాయణరావు ఒకేసారి రాష్ట్ర అసెంబ్లీలో అడుగుపెట్టామని చెప్పారు.ఆయన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలోను బయట చాలా పోరాటాలు చేశారని అన్నారు.తాను కార్మికశాఖ మంత్రిగా పనిచేసిన కాలంలోను కామ్రేడ్ సూర్యనారాయణరావు కార్మికుల సంక్షేమం అమలుకోసం ఆయననుంచి చాలా సలహాలు సూచనలను తీసుకున్నామని సిఎం చెప్పారు.కామ్రేడ్ సూరి తన రాజకీయ జీవితంలో చాలా పారదర్శకంగా పనిచేసి ఉన్నత మార్గం వేశారని గుర్తుచేసుకున్నారు.ఇప్పటి విపక్షాల నాయకుల మాదిరిగా కాకుండా కార్మికుల కోసం నిజంగా పాటుపడిన గొప్పవ్యక్తని చెప్పారు.సూరి ఆదర్శాలను అందరూ పాటించాలని మనవి చేశారు. బెంగళూరులో కార్మిక పోరాటాల చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు కార్మిక పోరాటాల మ్యూజియం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సెమినార్‌లో సిఐటియు జాతీయ ప్రధానకార్యదర్శి తపన్‌సేన్ పాల్గొన్నారు.సెమినారుకు విజెకె నాయర్ అధ్యక్షత వహించారు.

## 2కోట్ల రూపాయల జీవితబీమా సొమ్ముకోసం వ్యక్తిని లారీతో ఢీకొట్టి హత్యచేసిన కిలాడీ జంట అరెస్టు

**హాసన్,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి**

హాసన్‌జిల్లా అరసీకెరెకు చెందిన ఒక వ్యక్తి జీవితబీమా సొమ్మును దోచుకునేందుకు ఒక జంట వ్యక్తిని హత్యచేసి జీవితబీమా పాలసీ విడిపించుకునేందుకు ప్రయత్నించి ఇపుడు పోలీసుల అతిథులయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అరసికెరెకు చెందిన మునిస్వామిగౌడ శిల్పారాణి అనే దంపతులు అడ్డదారుల్లో డబ్బు సంపాదించేందుకు జీవితబీమా సొమ్మును కాజేసేందుకు పథకం పన్నారు.ఇందుకోసం మునిస్వామిగౌడ పథకం ప్రకారం రెండుకోట్ల రూపాయల మేరకు ఇన్సు రెన్సు తీసుకున్నాడు.తనలాగే ముఖ కవళికలు ఉండే వ్యక్తికోసం వెతుకులాట జరిపి అరసీకెరె ప్రాంతంలో అపరిచితుడుని ఎంపిక చేశారు. ఇందుకోసం నాగరాజుఅనే వ్యక్తిని ఎంపిక చేసి గండసిరోడ్డులో లారీతో ఢీకొట్టించి 2కోట్ల రూపాయల జీవితబీమా పాలసీని సొమ్ము చేసుకునేందుకు ప్లాన్ వేశాడు. పది రోజుల కిందట ఈ కిలాడీ జంట ఒక నిర్జన ప్రదేశంలో లారీతో ఢీకొట్టి హత్య చేశారు. సదరు వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందాడని జీవితబీమా పాలసీ పేపర్లను సృష్టించి మునిస్వామిగౌడ క్లెయిం చేసుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేశారు.ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అనుమానం మీద కిలాడీ జంటను అరెస్టు చేసి తమదైన పద్ధతుల్లో విచారణ జరపగా తామే అపరిచిత వ్యక్తిని జీవితబీమా సొమ్ము కోసం హత్య చేశామని పోలీసుల ముందు వెల్లడించారు.ఇపుడు ఈ కిలాడీ జంట అరసికెరె పోలీసుల అదుపులో ఉన్నారు.

